# సాక్షి
## వైఎస్‌ఆర్‌ జిల్లా
ఆదివారం । 12 । అక్టోబర్ । 2025






**కూటమి ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యమం**
వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరే కిస్తూ వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంత కాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నేతలు అన్నారు. -8లో



**294 కిలోల టపాసులు స్వాధీనం**
ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌లో కలమల షరీఫ్ ఇంట్లో అక్రమంగా టపాసులు డంపు చేశారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. -8లో

గరిష్టం/కనిష్టం
32.7/24.2

**వాతావరణం**
జిల్లాలో శనివారం 24.2 - 32.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్


### టాలెంట్ హంట్ సెలక్షన్స్ వాయిదా
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈనెల 13 నుంచి 16 వరకు జరగబోయే అండర్ 12, అండర్ 14, అండర్ 16, అండర్ 19, టాలెంట్ హంట్ సెలక్షన్లు అనివార్య కారణాలవల్ల వాయిదా పడింది.ఈ విషయాన్ని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### ఎన్టీఆర్ వైద్య సేవ బంద్ కొనసాగింపు
కడప రూరల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ బంద్ శనివారం రెండోరోజుకు చేరింది. ప్రభుత్వం బిల్లులను చెల్లించకపోవడంతో ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఓపీతో పాటు సర్జరీలను పూర్తిగా నిలుపుదల చేశాయి. జిల్లావ్యాప్తంగా 119 నెట్ వర్క్ ఆసుపత్రులు ఉండగా అందులో 42 ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలుపుదల చేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత వైద్య సేవలు యధావిధిగా ఎప్పుడు కొనసాగుతాయోనని చర్చించుకుంటున్నారు.

### రేపు కలెక్టరేట్ వద్ద రైతుల నిరసన
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 13వ తేదీ కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో రైతుల నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడపలోని జెడ్పీ ప్రాగణం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలు దేరి 11 గంటల నుంచి 12 గంటల వరకు నిరసన తెలియచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

### 13 నుంచి తిరుపతిలో రెసిడెన్సియల్ శిక్షణ
కడప అగ్రికల్చర్: వైఎస్సార్ కడపజిల్లా రైతు సాధికారత సంస్థ వారి ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఫర్ న్యాచురల్ ఫామింగ్(ఎన్‌ఎంఎఎన్‌ఎఫ్) పోగ్రాం ద్వారా బయో రీసోర్సు సెంటర్‌పై ఈ నెల 13వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రకృతి సేద్యం ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తిరుపతిలో రెసిడెన్సియల్ శిక్షణా కేంద్రంలో శిక్షణకు ఆసక్తి గలిగిన రైతులు 9849900965 నెంబర్‌కు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

### జిల్లాలో వర్షం
కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వర్షాలు కురిశాయి. సీకేదిన్నెలో అత్యధికంగా 60.4 మిల్లీమీటర్ల వర్షం కురిసంది. ఆట్లూరులో 44.8 , గోపవరంలో 40.2, కడపలో 38.6 , చాపాడులో 35.4, పెండ్లిమర్రి, ఖాజీపేటలలో 33.2, సిద్ధవటంలో 28.8, బద్వేల్‌లో 28.4 , పొద్దుటూరులో 18.8, లింగాలలో 18.2, చక్రాయపేటలో 17.2, బిమతంలో 16.2 , కమలాపురంలో 12.4, చెన్నూరలో 11.2, తొండూరులో 10.2, వీఎన్‌పల్లిలో 9.6, వేంపల్లెలో 8 , మైదుకూరులో 7.4, పులివెందులలో 6, వేములలో 5, ఎర్రగుంట్లలో 4.4 , జమ్మలమడుగులో 3.4, ఒంటిమిట్టలో 3.2, వల్లూరులో 2.4, దువ్వూరులో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### గాలివీడులో కుండపోత వర్షం

వెలిగల్లు జలాశయానికి జలకళ

గాలివీడు: వరుణుడు ఉగ్రరూపం దాల్చడంతో అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో శుక్రవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. 108.4 మిల్లీ మీటర్లుగా నమోదైందని ఏఎస్ఓ శ్రీదుర్గ తెలిపారు. ఈ వర్షానికి చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లి ప్రవహించాయి. వెలిగల్లు జలాశయానికి వదర ప్రవాహం పెరగడంతో 3.027 నీటిమట్టం టీఎంసీలకు చేరుకుందని డీఈ శిరీష్‌కుమార్ తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.11 టీఎంసీలకు చేరింది. మండలంలోని గోరాన్ చెరువు నుండి వడిశలంకపల్లి వరకూ వరద నీరు పెరగడంతో పెద్ద చెరువుకు నీరు చేరింది. ఎల్లంపల్లి కుషావతి రిజర్వాయర్ నుంచి నడింపల్లి మీదుగా వచ్చే ప్రవాహంతో చిన్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

## ● సాగుకు వేళాయె..
# రాయితీ విత్తనం రాకపాయె

- జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- శనగ సాగుకు రైతులు సన్నద్ధం
- విత్తనాల కోసం అన్నదాత ఎదురుచూపులు






కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనగపంటసాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు.అయితే విత్తనాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. గత వారం 25 శాతం రాయితీతో ధరను కూడా ప్రకటించింది. ఇందులో కిలో శనగ విత్తనాల సాధారణ ధర రూ.78 కాగా రైతు కిలోకు రూ. 58.50 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వం 25 శాతం రాయితీతో కిలోకు 19.5 రూపాయల సబ్సిడీ ఇస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 40 శాతం రాయితీ ఇస్తే కూటమి సర్కార్ 25 శాతం మాత్రమే ఇచ్చింది.అయినా విత్తనాలు మాత్రం అందించలేదు. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

● విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.కానీ ఇంతవరకు అధికారికంగా పేర్లను నమోదు చేసుకోమని అధికారులు ప్రకటించకపోవడం గమనార్హం. రబీ సీజన్ ప్రారంభానికి ముందు నుంచే జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. అన్ని ప్రాంతాల్లో పొలాలు పదును అయ్యాయి. దీంతో రైతులు పొలాల్లో దుక్కులు దున్ని విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ ప్రభుత్వం విత్తనాలు అందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**ఇతర ప్రాంతాలకు వెళ్లి...**
జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు సబ్సిడీ విత్తనాలపై ఆధారపడకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఎందుకుంటే ఈ అదునులో శనగ విత్తుకోలేకపోతే మళ్లీ వర్షాలు వస్తాయో రావోనన్న భయం వారిని వెంటాడుతోంది. అంతేకాకుండా ప్రభుత్వం రాయితీతో అందించే విత్తనాల నాణ్యత సరిగా లేకపోతే అప్పటికప్పుడు తెచ్చుకోవాలంటే పుణ్యకాలం ముగిసిపోతుందోమేనన్న ఆందోళనతో ముందుగానే విత్తనాలను కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.



### ›› జిల్లాలో లక్ష ఎకరాలుపైనే...
జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది సరైన వర్షాలు లేని కారణంగా పత్తి, మినుము, వేరుశనగ, పెసర వంటి ఆరుతడి పంటలసాగు తగ్గింది. దీంతో రబీలో లక్ష ఎకరాలకు మించి శనగపంట సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. కానీ కేవలం 37641 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు జిల్లాకు కేటాయించినట్లు తెలిసింది. ఇవి సరిపోవని రైతులు, రైతు సంఘ నాయకులు చెబుతున్నారు.

**బహిరంగ మార్కెట్లో కిలో రూ.60**
శనగ విత్తనాలు బహిరంగ మార్కెట్లో కిలో రూ. 60కి దొరుకుతున్నట్లు పలువురు రైతులు తెలిపారు. ప్రభుత్వం కిలో సబ్సిడీతో 58.50కి సరఫరా చేస్తామంటోంది. అంటే బయట మార్కెట్లో దొరికే విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే విత్తనాలకు కేవలం కిలోపైన రూ. 1.50 మాత్రమే తేడా ఉంటంతో చాలా మంది రైతులు బయట నుంచి కొలుగోలు చేసి తెచ్చుకుంటున్నట్లు తెలిసింది.

### 50 శాతం రాయితీతో ఇవ్వాలి ..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు శనగ విత్తనాలను 50 శాతం రాయితీతో ఇవ్వాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తే కూటమి సర్కార్ కేవలం 25 శాతం ప్రకటించింది. ఇది రైతులకు భారం. ప్రభుత్వం స్పందించి 50 శాతం రాయితీతో విత్తనాలను సరఫరా చేయాలి.
– పోతిరెడ్డి భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (సీపీఐ రైతు విభాగం)

### లక్ష ఎకరాలకు మించి సాగు..

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది శనగపంట లక్ష ఎకరాలకు మించి సాగయ్యే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం 37,641 క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే కేటాయించింది. ఇవి రైతులకు ఏమాత్రం సరిపోతాయో అధికారులే తేల్చాలి.ప్రభుత్వం ఆలోచించి అధికంగా విత్తనాలు కేటాయించాలి.
–దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి(సీపీఎం రైతు విభాగం)

### త్వరలో పంపిణీ చేస్తాం.

రాయితీ శనగ విత్తనాలు జిల్లాకు వచ్చాయి. సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తాం.తరువాత నాలుగైదు రోజుల్లో పంపిణీని ప్రారంభించి రైతులకు అందజేస్తాం. ఎవరూ ఆందోళన చెందవద్దు.
– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి.


## డిసెంబరు 23న అంతర్జాతీయ సదస్సు
**అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి**


అంతర్జాతీయ సదస్సు బ్రోచర్లు విడుదల చేస్తున్న చొప్పాగంగిరెడ్డి

రాజంపేట: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చ, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా డిసెంబరు 23వ తేదీ నుంచి 24వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి తెలిపారు. ఏయూ వీసీ చాంబర్‌లో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను శనివారం ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి పరిశోధనల్లో ఏయూ మరింత ముందంజలో నిలుస్తుందని, నేటి యుగం డేటా ఆధారంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఏయూ వీసీ డా.సాయిబాబారెడ్డి మాట్లాడుతూ డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాలు నేటి సాంకేతిక ప్రపంచానికి నడిపించే శక్తులుగా మారాయన్నారు. ఆధునిక సాంకేతిక రంగాలపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధనాపత్రాలను సమర్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటీఎస్ వైస్ ఛ:ర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డా.నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ అడ్మిషన్స్ డా.జయరామిరెడ్డి, ప్రోగ్రాం చైర్ డా.చిన్నబాబు, కన్వీనర్ నాగరాజు, పబ్లికేషన్ చైర్స్ డా.పహీముద్దీన్, డా.వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

# సెగ్మెంట్.. సంపద!

- ప్రథమస్థానంలో పులివెందుల
- పదో స్థానంలో బద్వేలు..
- జగనన్న పాలనలో నియోజకవర్గాల అభివృద్ధి








రాజంపేట: ఉమ్మడి కడపలో జిల్లాలో ధనిక నియోజకవర్గాలను గుర్తించారు. డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ వెలువరించిన సమాచారం మేరకు పులివెందుల ప్రథమ, బద్వేలు పదోస్థానంలో ఉంది. నియోజకవర్గాల అభివృద్ధి, పాడిపంటలు, పరిశ్రమలు లాంటి వాటిని భేరీజు చేసుకొని ఏ నియో జకవర్గం ధనికమో తేల్చారు.

**పులివెందుల**
పులివెందుల నియోజకవర్గ సంపద రూ. 5573 కోట్లు. వ్యవసాయరంగంలో ప్రథమ స్థానంలో ఉంది. తుమ్మలపల్లె యురేనియం ప్రపంచంలో ఉన్న అతిపెద్ద యురేనియం మైన్స్‌లో ఒకటిగా భావిస్తారు.

**బద్వేలు..**
10వ స్థానంలో ఉన్న బద్వేలు నియోజకవర్గం సంపద రూ. 2746 కోట్లు. పాడిపరిశ్రమంలో జిల్లాలో రెండో స్థానంలో ఉంది. ఫిషింగ్ సెక్టారులో జిల్లాలో మొదటి స్థానంలోఉంది. మిగిలిన అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది.

**ప్రొద్దుటూరు..**
తొమ్మిదో స్థానంలో ఉన్న ప్రొద్దుటూరు నియోజకవర్గం సంపద రూ.2778 కోట్లుగా ఉంది. వ్యవసాయ, పరిశ్రమల సెక్టారులో వెనుకబడి ఉంది. బంగారు, టెక్స్‌టైల్స్ వ్యాపారంతో ఈ నియోజకవర్గం అభివృద్ధి చెందింది.

**కమలాపురం..**
7వ స్థానంలో ఉంది. ఈ నియోజకవర్గ సంపద 3358 కోట్లు ఉంది. చిన్నపాటి ఆటోమొబైల్, ఇంద్రస్టీగా అభివృద్ధి చెందింది.

**మైదుకూరు.**
6 వస్థానంలో ఉంది. ఈ నియోజకవర్గ సంపద రూ, 3430 కోట్లుగా ఉంది. వ్యవసాయరంగంలో రెండోస్థానంలో ఉంది, వేరుశనగ అధిక విస్తీర్ణంలో సాగవుతుంది.

**కడప..**
4వ స్థానంలో ఉన్న కడప నియోజకవర్గ సంపద రూ. 3718 కోట్లు. మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి.

| నియోజకవర్గం | సంపద (రూలలో) |
|---|---|
| పులివెందుల | 5573 |
| జమ్మలమడుగు | 4906 |
| రాయచోటి | 4145 |
| కడప | 3718 |
| రాజంపేట | 3629 |
| మైదుకూరు | 3430 |
| కమలాపురం | 3358 |
| రైల్వేకోడూరు | 3292 |
| ప్రొద్దుటూరు | 2778 |
| బద్వేలు | 2746 |

**జమ్మలమడుగు..**
2 స్థానంలో ఉన్న జమ్మలమడుగు నియోజకవర్గం సంపద రూ.4906 కోట్లు, సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. పరిశ్రమల రంగంలో బాగా ఉంది.

**జగన్నపాలనలో నియోజకవరాల అభివృద్ధి..**
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి పథంలో నడిచాయి. ఇప్పుడు కూటమి పాలనలో నియోజకవర్గాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదనే అపవాదు ను మూటకట్టుకుందని పరిశీలకులు భావిస్తున్నారు.

## శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో రెండోశనివారం సీతారామలక్ష్మణ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా మూల విరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. టీటీడీ అధికారులు తీసుకొచ్చిన నూతన పట్టువస్త్రాలు, బంగారు ఆభరాణాలు, తులసి గజమాలలతో సుందరంగా అలంకరించారు. సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రెండో శనివారం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

# బిగుస్తున్న ఉచ్చు!

- తాజాగా డ్రైవర్ అష్రఫ్ అరెస్ట్
- తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట హాజరుపర్చగా ఏడురోజుల రిమాండ్
- నకిలీమద్యం కేసులో ముఖ్య నిందితుల చుట్టూ తిరుగుతున్న కథ
- నిందితుల వాంగ్మూలాల్లో బయటపడుతున్న బంధం






మదనపల్లెలో తంబళ్లపల్లె తహసీల్దార్ ఎదుట అష్రఫ్‌ను హాజరుపరిచిన ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె: ములకలచెరువు నకిలీమద్యం తయారీ రాకెట్ వ్యవహారంలో ముఖ్య నిందితుల చుట్టూ కేసు తిరుగుతోంది. ఇందులో టీడీపీ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి వద్ద పనిచేసిన వారు కేసులో ముగ్గురు నిందితులుగా ఉండటం గమనార్హం. నకిలీమద్యం తరలించే వాహనానికి డ్రైవర్‌గా పనిచేసిన ములకలచెరువు నల్లగుట్టకు చెందిన సయ్యద్ కలీం అష్రఫ్ (23)ను అరెస్ట్‌చేసిన ఎక్సైజ్‌పోలీసులు తంబళ్లపల్లె కోర్టుసెలవు కారణంగా శనివారం మదనపల్లెలోని తంబళ్లపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట హాజరుపరిచారు. కేసు, రిమాండ్ రిపోర్ట్ పరిశీలించిన ఆయన.. నిందితునికి ఏడురోజుల రిమాండ్ విధించగా మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

**జనార్దనరావే చేయించాడు**
2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అష్రఫ్ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి (ఏ-17 నిందితుడు) వద్ద ఆరునెలలు పనిచేశాడు. నల్లరంగు స్కార్పియో వాహనానికి డ్రైవర్‌గా పని చేశాడు. ఈ సమయంలోనే కేసులో ఏ-1 జనార్దనరావుతో పరిచయం ఏర్పడింది. తర్వాత డ్రైవర్‌గా తీసివేయడంతో ములకలచెరువు మార్కెట్ యార్డులో కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం మంత్రి గిరిధర్‌రెడ్డి (ఏ-18 నిందితుడు, జయచంద్రారెడ్డి బావమరిది)ని ఏదైనా పని చూపించమని కోరగా మద్యం దుకాణం లేదా క్వారీలో పని ఇప్పిస్తానని చెప్పాడు. తర్వాత జనార్దనరావును కలిసి పని కావాలని చెప్పగా రెండు-మూడురోజులకు ఒకసారి నల్లరంగు స్కార్పియో వాహనంలో బెల్టుషాపులకు నకిలీ మద్యం సరఫరా చేయాలని, దీనికి రోజుకు రూ.800 కట్టారాజు (ఏ-2 నిందితుడు) ఇస్తాడని జనార్దనరావు తెలిపాడు. అంగీకరించిన అష్రఫ్ జనార్దనరావు చెప్పినట్టు తన బైక్‌ను జయచంద్రారెడ్డి ఇంటివద్ద ఉంచాక ఆయన ఇంటిలో పనిచేస్తున్న అన్బురాసు అలియాస్ బాబు (ఏ-19 నిందితుడు) వాహనం తాళాలు తెచ్చి ఇచ్చేవాడు. వాహనంలో రాక్‌స్టార్ మద్యం దుకాణం వద్దకు వెళ్లి నకిలీమద్యం తీసుకుని బెల్టుషాపులకు తరలించేవాడినని. ఈ విషయం జయచంద్రారెడ్డి,అన్బురాసుకు తెలుసని, నకిలీమద్యం సరఫరా మొత్తం తనతో జనార్దనరావు చేయించినట్టు వాంగ్మూలంలో అష్రఫ్ పేర్కొన్నాడు.

### ›› రాజేష్ కీలకం
ఈ కేసులో జయచంద్రారెడ్డి పీఏ టి.రాజేష్‌ను కీలకమైన నిందితునిగా ఎక్సైజ్ పోలీసులు భావిస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన రాజేష్ పేరిట ఒక మద్యం దుకాణం, నకిలీమద్యం తరలించిన వాహనం ఉన్నాయి. ఇవికాక కురబలకోట మండలంలో కోట్ల విలువైన భూములు ఇతని పేరిట రిజిస్ట్రేషన్ జరిగి ఉండటం వెలుగుచూసింది. ఇవి కాక ఇతర విషయాలు వెలుగులోకి రావాలంటే రాజేష్ అరెస్ట్ కీలకమని చెబుతున్నారు. విచారణలో మరిన్ని వాస్తవాలు తెలుస్తాయని అంటున్నారు. ఈ కేసులో 23 మందిని నిందితులుగా పేర్కొన్న ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసిన అష్రఫ్‌తో కలిపి ఇప్పటిదాకా 14 మందిని అరెస్ట్ చేయగా మిగిలిన నిందితులు జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, అన్బురాసు, బాలాజీ, సుదర్శన్, రవి, శ్రీనివాసులురెడ్డి, చైతన్యబాబు అరెస్ట్ కావాల్సి ఉంది.

### ▸▸ ఆ ముగ్గురి చుట్టూ..
జనార్దనరావు, జయచంద్రారెడ్డి, ఆయన బామర్ది గిరిధర్‌రెడ్డి చుట్టూనే కేసు నడుస్తోంది. జయచంద్రారెడ్డి, జనార్దనరావులు మిత్రులు కావడం , ఇక్కడికి పని చేస్తున్న వాళ్లను వివిధ ప్రాంతాల నుంచి రప్పించడం, నకిలీమద్యం తయారీ, సరఫరాలో వీరిపాత్ర వెలుగులోకి వచ్చింది. ఇప్పటిదాకా అరెస్ట్ అయిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వీరి ప్రస్తాపన ఉన్నట్టు తెలుస్తోంది. ఏ-2 కట్టా రాజు డైరీలో ఏ-1 జనార్దనరావుతో సహా పలువురికి ఎంతెంత నగదు ఇచ్చింది, ఎవరి ఖాతాలో ఎంత నగదు జమచేసింది వివరాలు అందులో గుర్తించారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఈ విషయాలను పేర్కొన్నారు. తెనాలికి చెందిన కొడాలి శ్రీనివాసరావు కూడా తనకు ములకలచెరువు నకిలీమద్యం తయారీ కోసం భవనం లీజును తన పేరిట తీసుకోవడానికి జనార్దనరావు చెప్పడవల్లే జరిగిందని కూడా వెల్లడైంది. నకిలీమద్యం తయారీ ప్లాంట్‌పై ఎక్సైజ్ పోలీసుల దాడి విషయం జనార్దనరావే వాట్సప్ కాల్ ద్వారా తనకు తెలియజేసి ములకలచెరువు వెళ్లొద్దని చెప్పిన విషయాన్ని శ్రీనివాసరావు వెల్లడించినట్టు ఎక్సైజ్ పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

**వాళ్లను కస్టడికి ఇవ్వండి**
నకిలీమద్యం కేసులోని నిందితులను కస్టడికి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టును ఆశ్రయించారు. ముఖ్యమైన సమాచారం, వివరాలను సేకరించాల్సి ఉందని, దీనిపై నిందితుల కస్టడీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ వేయగా సోమవారం కోర్టులో విచారణ జరగనుంది. కోర్టు నిర్ణయం తర్వాత ఎక్సైజ్ పోలీసులు తదుపరి చర్యలను చేపట్టనున్నారు.

## తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య

**ప్రొద్దుటూరు క్రైం :** చెడు తిరుగుళ్లు తిరగొద్దని మందలించినందుకు ఇమాంబాషా అలియాస్ మున్నా (22) చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. స్థానిక ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన మాబున్నాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త గౌస్‌బాషా కువైట్‌లో ఉంటున్నాడు. కుమారుడు ఇమాంబాషా 8వ తరగతి వరకు చదువుకొని స్కూల్‌కు వెళ్లడం మానుకున్నాడు. చిన్న చిన్న కూలి పనులు చేసుకునేవాడు. ఇటీవల కాలంలో అతను స్నేహితుల వెంట తిరుగుతూ చెడు వ్యసనాలకు లోనయ్యాడు. బయటికి వెళ్తే వారం, పది రోజులు ఇంటికి వచ్చే వాడు కాదు. స్నేహితుల వెంట తిరగొద్దని తల్లి శుక్రవారం అతన్ని మందలించింది. ఇంట్లో నుంచి వెళ్లిన అతను రాత్రి బైపాస్‌రోడ్డు సమీపంలోని అటవీశాఖ స్థలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

## ఉరి వేసుకుని మరొకరు..


ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సురేష్

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల రైల్వే క్యాంటీన్‌లో పనిచేస్తున్న కంభం సురేష్(32) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డి వివరాల మేరకు.. పట్టణంలోని మెయిన్ బజార్ కన్యకాపరమేశ్వరీ ఆలయం సమీపంలోని రైల్వే క్యాంటీన్‌ను ఇమ్రాన్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంటీన్‌లోనే పనిచేస్తున్న సురేష్ తన అవసరాల నిమిత్తం అప్పుడప్పుడూ కొంత డబ్బు ఇమ్రాన్ వద్ద తీసుకునేవాడు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేక ఇబ్బందిపడ్డారు. దీంతో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు జమ్మలమడుగు పట్టణం పెద్దబజారుకు చెందిన వాడిగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించి వీఆర్ఓ విజయభాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రిమ్స్‌లో గుర్తుతెలియని మృతదేహాలు





**కడప అర్బన్ :** కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో గత కొన్నిరోజుల నుంచి చికిత్స పొందుతున్న వారిలో గుర్తుతెలియని ఇద్దరు పురుషులు, ఓ మహిళ శనివారం మృతి చెందారు. వారి మృత దేహాలను రిమ్స్ మార్చురీలో వుంచారు. ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలియజేశారు.





### కూటమి ప్రభుత్వ నిర్ణయంపై

# రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

- ప్రజల సమక్షంలో కోటి సంతకాల సేకరణ
- జిల్లా వ్యాప్తంగా రచ్చబండ కార్యక్రమాలు
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయర్ సురేష్‌బాబు


కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయర్ కె. సురేష్ బాబు

**కడప కార్పొరేషన్ :** వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయర్ కె.సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో శనివారం సంబంధిత కార్యక్రమ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి దూరదృష్టితో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల తీసుకువస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ అనుచరులు, బినామీలకు దోచిపెట్టేందుకు ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పీపీపీ విధానం అంటూ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి నవంబర్ 22వ తేదీ వరకూ రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి సంతకాలు సేకరిస్తామన్నారు. అక్టోబర్ 23న నియోజవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సేకరించిన సంతకాల పత్రాలను గవర్నర్‌కు అందజేస్తామని వారు వివరించారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేస్తే మెరుగైన వైద్యం ఎలా అందుతుందని వారు ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అతివృష్టి లేక అనావృష్టి వచ్చి రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది కూడా గిట్టుబాటు ధర లేక పండించిన పంట నీటిపాలైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే ప్రతి మూడు బాటిళ్లలో ఒక బాటిల్ కల్తీదని అంజద్‌బాషా అన్నారు. పర్మిట్ రూంలో తాగిన కొన్ని క్షణాల్లోనే వ్యక్తి మృతి చెందడానికి కారణం కల్తీ మద్యమేనన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి, ఎస్ఈసీ సభ్యులు ఎస్.యానాదయ్య, గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, కార్పొరేటర్లు కె.బాబు, షఫీ, బాలస్వామిరెడ్డి, పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, సీహెచ్.వినోద్, గౌస్, అక్బర్, బండి ప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, డిష్‌జిలాన్, రెడ్డి ప్రసాద్, రహీం, టీపీ వెంకట సుబ్బమ్మ,బండి దీప్తి, మరియలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అనుమానాస్పద మృతి


మంగళి లక్ష్మీదేవి మృతదేహం

**చింతకొమ్మదిన్నె :** చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లె జగనన్న కాలనీకి చెందిన మంగళి లక్ష్మీదేవి (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారని చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు... మామిళ్లపల్లె జగనన్న కాలనీకి చెందిన మంగళి బుగ్గ రమేష్ భార్య మంగళి లక్ష్మీదేవి సెప్టెంబర్ 30న భర్తతో గొడవపడి మరుసటి రోజు నుంచి కనిపించడం లేదు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్టోబర్ 4న మహిళ అదృశ్యం కేసు నమోదు చేశారు. లక్ష్మీదేవి ఆచూకీ కొరకు గాలించగా చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్ సమీపంలోని బుగ్గవంకలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు మేకలకాపరి సమాచారం ఇచ్చారు. మృతదేహం లక్ష్మీదేవిదే నని చూసిన కుటుంబ సభ్యులు గుర్తించారు. ఆమెకు భర్త బుగ్గరమేష్‌తోపాటు ఇరువురు కుమారులు ఉన్నారు. భర్త ఇందిరానగర్‌లో బార్బర్ షాపు నిర్వహిస్తున్నారు. విష ద్రావణం తాగి లక్ష్మీదేవి మృతి చెందినట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

## 294 కిలోల టపాసులు, సామగ్రి స్వాధీనం


టపాసులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

**ప్రొద్దుటూరు క్రైం :** పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో టపాసులు తయారు చేస్తున్న ఓ ఇంటిని పోలీసులు గుర్తించారు. కలమల షరీఫ్ ఇంట్లో దీపావళి పండగ నేపథ్యంలో అక్రమంగా టపాసులు డంపు చేశారని సమాచారం రావడంతో టూ టౌన్ సీఐ సదాశివయ్య, ఎస్ఐ ధనుంజయుడు సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. షరీఫ్, అతని తల్లి కొన్ని రోజుల నుంచి ఇంట్లోనే టపాసులు తయారు చేస్తున్నారు. తల్లీకొడుకులిద్దరూ కంపెనీ బ్రాండ్లకు తోడుగా స్వంతంగా కొన్ని రకాల చిచ్చు బుడ్లు, ఔట్లను తయారు చేసేవారు. సుమారు 294 కిలోల మేర నిల్వ ఉంచిన టపాసులు, సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. లైసెన్స్ లేకుండా టపాసులను విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. ఎవరైనా వీధుల్లో టపాసులు విక్రయిస్తే సమాచారం అందించాలని కోరారు.

## ఆగిన లారీని ఢీకొన్న బస్సు

**ఒంటిమిట్ట :** ఒంటిమిట్ట వద్ద ఆగిన లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో కండక్టర్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు పులివెందుల నుంచి ఆర్టీసీ బస్సు తిరుపతికి బయలుదేరింది. ఒంటిమిట్ట వీరాంజనేయస్వామి గుడి వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బస్సు డ్రైవర్ రమణారెడ్డి ఆగిన లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కండక్టర్ యంగమునికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నందలూరు నుంచి 108 వాహనం రప్పించి యంగమునిని కడప రిమ్స్‌కు తరలించారు. సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో 80మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు సమాచారం.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## ఎస్పీ బంగ్లా ఎదుటే సైకో వీరంగం


ఎస్పీ బంగళా ఎదుట సైకో వీరంగం

**కడప అర్బన్ :** జిల్లా ఎస్పీ బంగ్లా ఎదుటే ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. కారుతో వచ్చి.. పోలీసులను లెక్క చేయకుండా హల్‌చల్ చేశాడు. స్థానికుల వివరాల మేరకు.. కడప నగరంలోని ఎస్పీ బంగ్లా ఎదుట శనివారం రాత్రి నడిరోడ్డుపైకి తన కారులో వచ్చిన ఓ యువకుడు రోడ్డుకు అడ్డంగా నిలిపి హల్‌చల్ చేశాడు. పోలీసులను సైతం లెక్క చేయకుండా తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని.. పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. ఎమ్మెల్యేకు చెప్పుకో పో అని కాసేపు.. చంద్రబాబుకు చెప్పుకో అని కాసేపు.. పవన్ కళ్యాణ్ నాకు తెలుసునంటూ కాసేపు కేకలు వేశాడు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అతనిని కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నకిలీ మద్యం కేసు సీబీఐకి అప్పగించాలి

**– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి**



**రాయచోటి అర్బన్ :** నకిలీ మద్యం కేసు సీబీఐకి అప్పగించాలని, కూటమి నేతల కల్తీ లిక్కర్ కుటీర పరిశ్రమలపై నిజాలు నిగ్గుతేల్చాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటిలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యంతో జగన్ ప్రభుత్వం హయాంలో ఏదో జరిగిపోయిందని ఆరోపించిన చంద్రబాబు చివరకు నిరూపణ చేయలేకపోయారన్నారు. ఆధారాలు లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డి, సీనియర్ అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను అక్రమంగా నిర్బంధించారన్నారు. కూటమి నాయకులు మాత్రం కల్తీ మద్యం తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రాణాంతకమైన స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు సి మహిళ పసుపుకుంకాలతో ఆటలాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు రూ.40 నుంచి రూ.50 కోట్ల ప్రజాధనం కొల్లగొడుతున్నారన్నారు. కల్తీ మద్యం తయారీలో చంద్రబాబు, లోకేష్, ఇతర నాయకుల పాత్రపై సీబీఐచే విచారణ చేయించి నిజాలు నిగ్గుతేల్చాలన్నారు. 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు పూనుకున్న కూటమి సర్కార్‌పై కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామని, ప్రైవేటీకరణ ఆపేంత వరకూ పోరాటం ఆపేదిలేదన్నారు.

## లైన్‌మెన్‌పై టీడీపీ కాంట్రాక్టర్ దాడి

- అధికారుల సమక్షంలోనే ఘర్షణ
- దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన ఏఈ

**ఖాజీపేట :** సాక్షాత్తూ అధికారుల సాక్షిగా.. అధికారుల సమక్షంలోనే టీడీపీ కాంట్రాక్టర్ ఘర్షణకు దిగాడు. లైన్‌మెన్‌పై ఆవేశంతో దాడికి దిగాడు.. తానేమీ తక్కువకాదన్నట్లు లైన్‌మెన్ కూడా చేయి చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. ఖాజీపేట టౌన్‌లో టీడీపీకి చెందిన వెంకటయ్య విద్యుత్ కాంట్రాక్టర్‌గా ఉన్నారు. పత్తూరు సచివాలయం పరిధిలో జూనియర్ లైన్‌మెన్‌గా చంద్రానాయక్ పనిచేస్తున్నారు. 20రోజుల కిందట విద్యుత్తు పరికరాల విషయంలో కాంట్రాక్టర్, లైన్‌మెన్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో పనుల నిమిత్తం శుక్రవారం ఏఈ కార్యాలయానికి కాంట్రాక్టర్ వెంకటయ్య వచ్చాడు. అప్పటికే అక్కడ జూనియర్ లైన్‌మెన్ చంద్రానాయక్ ఉండడంతో ఇద్దరూ ఘర్షణకు దిగారు. టీడీపీ కాంట్రాక్టర్ దాడి చేయడం.. లైన్‌మెన్ చేయి చేసుకోవడం జరిగిపోయింది. ఘర్షణలో కాంట్రాక్టర్ చేయి విరిగిపోగా.. జూనియర్ లైన్‌మెన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాంట్రాక్టర్ వెంకటయ్య మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు ఖాజీపేట సీఐ వంశీధర్ కేసు నమోదు చేశారు.

**దీర్ఘకాలిక సెలవులో ఇన్‌ఛార్జి ఏఈ**

సబ్ స్టేషన్‌లో అసలు గొడవకు కారణం విద్యుత్ పరికరాల అమ్మకమేననే గుసగుసలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేసే ఒక వ్యక్తి కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. వచ్చిన విద్యుత్ పరికరాలు ఇప్పటికే చాలా వరకూ అమ్మేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయం ఇన్‌చార్జి ఏఈ దృష్టికి రాగా.. తనకు సమస్య వస్తుందేమోనని దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు చర్చ సాగుతోంది. గడచిన రెండేళ్లలో ఖాజీపేట మండలానికి వచ్చిన మెటీరియల్, చేసిన పనులపై విచారణ జరిపితే అసలు దొంగలు బయటపడతారని భావిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సబ్ స్టేషన్ పరిధిలో గొడవ జరగడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విచారణ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యుత్తు సిబ్బంది కోరుతున్నారు.

## బరిలో దిగితే.. పతకమే

**రజిత పతకాలతో సారా ఇర్ఫాన్ సత్తా**


రజత పతకాలతో ఇర్ఫాన్


స్కేటింగ్ పోటీల్లో సారా ఇర్ఫాన్

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** ఆ చిన్నారి వయసు పదేళ్లు... పట్టుదల ఏకాగ్రత, అలుపెరుగని సాధనతో లక్ష్యంపై గురిపెట్టి పతకాలు సాధించారు. చిన్న వయసులోనే అద్భుత సాధనతో రాణించి భళా అనిపించారు. కడప నగరంలోని ఎడిఫై ఇంగ్లీష్ మీడియం ఇంటర్నేషనల్ స్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. పొద్దుటూరుకు చెందిన పదేళ్ల చిన్నారి సారా ఇర్ఫాన్ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. అండర్-14 ఇన్‌లైన్ విభాగంలో రింగ్-3, రింగ్-4, రోడ్డు-1 కేటగిరీలలో రాణించి భళా అనిపించారు. దీంతో ఆయా విభాగాల్లో బాలుడికి మూడు రజత పతకాలు దక్కాయి. ఈ విజయాలతో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సారా ఇర్ఫాన్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని విజయాలు సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. సారా తండ్రి ఇర్ఫాన్‌బాషా, కోచ్ నాగేశ్వరరావులను నిర్వాహకులు అభినందించారు.

## ఈవ్ టీజింగ్ వద్దన్నందుకు కండక్టర్, డ్రైవర్‌పై దాడి

**మదనపల్లె రూరల్:** అతిగా మద్యం తాగి ఆర్టీసీ బస్సులో అమ్మాయిలను ఈవ్‌టీజింగ్ చేస్తున్న యువకులను అడ్డుకున్నందుకు ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కండక్టర్, డ్రైవర్ తెలిపిన వివరాలు... మదనపలె డిపోకు చెందిన కండక్టర్ శ్రీరాములు, డ్రైవర మురగయ్య మదనపల్లె-మొటుకుపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసు విధులకుహాజరయ్యారు. శనివారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు సమీపంలోని మొటుకుపల్లె నుంచి బస్సు మదనపల్లెకు బయలుదేరింది. మండలంలోని గెలిజగూరు సమీపంలో భరత్, రాజేష్, భానుప్రకాష్, మరికొందరు స్నేహితులతో కలిసి అతిగా మద్యం తాగి బస్సు ఎక్కారు. కేకలు వేస్తూ బస్సులోని యువతులను ఈవ్‌టీజింగ్ చేయసాగారు. కండక్టర్ శ్రీరాములు వారి వద్దకు వెళ్లి అమ్మాయిలతో ఇలా ప్రవర్తించడం సరికాదని హెచ్చరించారు. మద్యం మత్తులో ఉన్న యువకులు కండక్టర్‌ను అసభ్యపదజాలంతో దూషించి దాడికి పాల్పడ్డారు. ప్రయాణికులు ఎంత వారించినా వినకపోవడంతో బస్సుపోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని డైరవర్ మురుగయ్యకు కండెక్టర్ చెప్పారు. బస్సు పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్తావా? అంటూ డ్రైవర్ మురగయ్యపైనా యువకులు దాడి చేశారు. దాడిలో కండక్టర్, డ్రైవర్లు గాయపడ్డాడు. అల్లరి చేస్తున్న ఆకతాయిలను ప్రయాణికులంతా పట్టుకుని బస్సును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాడి ఘటనపై పోలీసులకు ప్రయాణికులతో కలిసి కండక్టర్, డ్రైవర్ ఫిర్యాదు చేశారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి తిరిగి వెళ్లిపోయారు.

## ప్రొఫెసర్ ఇంట్లో దోపిడీ డ్రైవర్ పనే

- 7 మంది ముఠా అరెస్టు
- రూ.1.27 కోట్లు, కొంత బంగారం స్వాధీనం

**బెంగళూరు (బనశంకరి) :** ఎంతో నమ్మకంగా ఉన్న కారు డ్రైవరే దోపిడీదారుగా మారాడు, తన స్నేహితులతో కలిసి ఓ ప్రైవేటు కాలేజీ ప్రొఫెసర్ ఇంట్లో రూ.1.50 కోట్ల నగదు, 50 గ్రాముల బంగారు ఆభరణాలు దోచేసిన 7 మందిని యలహంక పోలీసులు అరెస్టుచేశారు. వీరి వద్ద నుంచి రూ.1.27 కోట్ల నగదు, రెండు కార్లు, బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ తెలిపారు. శనివారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు.

**తంబళ్లపల్లెతో లింకులు**

నిందితులు ఆర్ఎంవీ రెండోస్టేజ్ రాజేంద్ర మునోట్ అలియాస్ రాజేంద్ర జైన్, విజయనగర చోళరపాళ్య శ్రీనివాస్, శ్రీనగర కిరణ్‌కుమార్ జైన్, శ్రీరాంపుర హేమంత్‌కుమార్ జైన్, దుమ్మలూరు బీడీఏ లేఔట్ వాసి శంకరప్ప, రామమూర్తినగరవాసి శంకరప్ప, హైదరాబాద్ రామనగర్‌వాసి మోహన్‌గౌడ అలియాస్ జనార్దన్. ఇందులో దుమ్మలూరు శంకరప్ప ప్రొఫెసర్‌కు కారు డ్రైవర్, అతని ఇంట్లో భారీగా డబ్బు ఉందని గమనించాడు. దీంతో మిగతా నిందితులతో కలిసి కుట్ర చేశాడు. గత నెల 19న యలహంక వినాయకనగరలోని ప్రొఫెసర్ ఇంట్లోకి చొరబడ్డారు. తాము ప్రభుత్వ అధికారులమని, మీ ఇంటిని తనిఖీ చేయాలని అతని భార్య, తల్లిని బెదిరించారు. పైన పేర్కొన్న మేరకు నగదు, బంగారాన్ని తీసుకుని కారులో ఉడాయించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి గత నెల 23 తేదీన సంజయ్‌నగరలో ఓ వ్యక్తిని అరెస్టుచేశారు. రెండో వ్యక్తిని ఆంధ్రప్రదేశ్‌లోని తంబళ్లపల్లె వద్ద రేణుమాకలపల్లి గ్రామంలో, బెంగళూరు విజయనగర చోళరపాళ్యలో మిగతా ఐదుమందిని పట్టుకున్నారు. ఇతని మిత్రుడు జనార్దన్ రూ.55 లక్షలు హైదరాబాద్‌లో, రేణుమాకలపల్లిలోని ఓ ఇంట్లో 25.80 లక్షలను దాచి ఉంచాడు. నిందితుల ఇళ్లలో గాలించి రూ.1.27 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## ఈతకు వెళ్లి వ్యవసాయ విద్యార్థి మృతి


జనార్దన్ నాయక్ (ఫైల్)

**మహానంది :** ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం బలిగొంది. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి పాలేరు వాగులో నీట మునిగి మృతి చెందాడు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె మండలం జిల్లెలమంద సమీపంలోని పెద్దతాండకు చెందిన బి.జనార్దన్‌నాయక్ (21) మహానంది సమీపంలోని వ్యవసాయ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో శనివారం కళాశాల సమీపంలోని పాలేరువాగు వద్దకు తోటి విద్యార్థులతో కలిసి వెళ్లాడు. అక్కడ కొంత మంది దుస్తులను శుభ్రం చేసుకోవడంతో పాటు ఈతకు దిగారు. ఈ క్రమంలో ఐదారుగురు ఈతకు దిగగా సరిగా ఈత రాని జనార్దన్ నాయక్ వాగులోకి దిగాడు. కొద్ది సేపటికి పక్కనే ఉన్న అతను కనిపించకపోవడంతో మిగిలిన విద్యార్థులు అన్వేషించగా అక్కడే లోతు ఉన్న గుంతలో అపస్మారక స్థితిలో కనిపించాడు. బయటికి తీసి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, పోలీసులు, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలు కింద పడి మహిళ మృతి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కడప-కనుమలోపల్లె మార్గంలో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తుతెలియని శనివారం మహిళ మృతిచెందిందని రైల్వే పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.... మృతురాలికి 50 సంవత్సరాల వయస్సు ఉందన్నారు. మృతురాలి ఆచూకీ లభించకపోవడంతో మహిళ మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీలో భద్రపరిచారు. ఆమె వద్ద ప్లాస్టిక్ సంచిలో ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు ఉన్నాయని, బాటిల్స్ ఏరుకుని జీవనం సాగించేదని తెలియవచ్చిందన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## కానిస్టేబుల్‌పై దాడి

**కడప అర్బన్ :** కడప నగరంలోని మాసాపేట వద్ద బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేశారు. కడప టూటౌన్ లో పనిచేస్తున్న బ్లూ కోర్టు కానిస్టేబుల్ నాలుగు రోజుల కిందట రాత్రి విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో మాసాపేట వద్ద ఓ వివాహానికి సంబంధించిన రిసెప్షన్ ఫంక్షన్ జరుగుతోంది. ఈ సమయంలో డీజే వేస్తుండడంతో అడ్డుకున్నారు. ఈ సంఘటనలో జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి, మరో వ్యక్తి కలిసి బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశారు.

## విద్యార్థికి సత్కారం


ప్రణీత్ సన్మానిస్తున్న రాజు, తదితరులు

**పులివెందుల టౌన్ :** మానవ శాస్త్రం విభాగంలో ప్రతిభ చూపిన విద్యార్థిని స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితరులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని గోపీ విహార్ స్ట్రీట్‌లో నివాసముంటున్న దివంగత బొంపెమ్ హరినాథ్, టీచర్ గోటూరు ఉషారాణిల కుమారుడు బొంపెమ్ ప్రణీత్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో ఎంఏ మానవశాస్త్రం చదువుతున్నారు. ఈ విభాగంలో బొంపెమ్ ప్రణీత్ మూడు గోల్డ్ మెడల్స్ సాధించి రికార్డు నెలకొల్పాడు. ఈ సందర్భంగా రాజు, సేవా సమితి సభ్యులు ప్రణీత్‌కు సత్కరించారు. రాజు మాట్లాడుతూ ప్రణీత్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, సురేష్, రాజు, రాజా, తదితరులు పాల్గొన్నారు.

## స్కార్పియో దొంగల అరెస్ట్

**కడప అర్బన్ :** కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో అలంకాన్ పల్లి సమీపంలో ఫ్రెండ్స్ కార్ గ్యారేజ్‌లో ఉంచిన స్కార్పియో వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు సెప్టెంబర్ 5న దొంగలించుకుని వెళ్లారు. తగిన ఆధారాలతో కడప తాలూకా సీఐ రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఎస్సై తాహిర్ హుస్సేన్ తమ సిబ్బందితో దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు నిందితులను ఇద్దరిని శనివారం రామరాజుపల్లి వై-జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. నిందితుల నుంచి స్కార్పియో స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో అమలాపురం పరిధిలో ఆత్రేయపురానికి చెందిన కారుటూరు సూర్య తేజ, విజయవాడకు చెందిన జోసెఫ్ ఉన్నారు. సూర్య తేజ పై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లో పరిధిలో 41 కేసులు నమోదయి ఉన్నట్లు పోలీసులు తమ విచారణలో బయటపడినట్లు తెలిపారు.

## ఒకరికి గాయాలు

**సుండుపల్లె :** మండలంలోని మిట్టబిడికి కాలనీలో శనివారం మధ్యా హ్నం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. నాగేశ్వర నాయ క్ గొర్రెలు మేపు తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన ఇసుక ట్రాక్టర్ అతన్ని ఢీకొంది. నాగేశ్వరనాయక్ తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు.